గ్రామసభలతో అభివృద్ధి

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా శుక్రవారం నాడు నిర్వహిస్తున్న గ్రామసభలు గ్రామాల అభివృద్ధికి తోడ్పడేలా జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గ్రామసభల నిర్వహణపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు నిర్వహించే గ్రామసభల్లో ఆయా మండల ప్రత్యేక అధికారులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామసభలు నిర్వహించి, గ్రామాభివద్ధికి ప్రణాళికలు రూపొందించనున్నట్లు చెప్పారు. ఇందులో అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక బాధ్యత వహించే ప్రతిఒక్కరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించి గ్రామస్తుల సమక్షంలో గ్రామసభల్లో పనుల ఆమోదించడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివద్ధి పనుల గుర్తింపు, ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకునేందుకు గ్రామ సర్పంచి అధ్యక్షతన ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. గ్రామసభలు పూర్తయిన వెంటనే ప్రభుత్వం రూపొందించిన ఈఎంఎంఎస్ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు, సంబంధిత మినిట్స్ నోట్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి హామీ పనిని కల్పించడంపై గ్రామ సభలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న మౌలిక సమస్యలను గుర్తించాలన్నారు. ఇక వర్షం నుంచి పడే ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టుకునే విధంగా చెక్ డ్యాములు, చెరువు మరమ్మతు పనులు చేపట్టే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామ సభలకు మండల స్థాయి అధికారిని స్పెషల్ ఆఫీసర్లుగా నియమించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, డిపిఒ ప్రభాకర్ రావు, జెడ్పీ సీఈవో ఓబులమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుమాస్తాల బదిలీల్లో

సీనియార్టీకి తిలోదకాలు..!

- ఉత్తర్వులకు నెల రోజుల సమయం పూర్తి
- మూడేళ్లు ఒకే సీటులో ఉన్న వారిపై శీతకన్ను
- పాత తప్పులు సరిదిద్దకుండా ఉత్తర్వుల అమలుకు సన్నాహాలు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్‌లో నెల రోజుల క్రితం అప్పటి కమిషనర్ మేఘ స్వరూప బదిలీ అయిన సందర్భంలో గుమాస్తాల బదిలీ ఉత్తర్వులపై సంతకాలు చేసి వెళ్లారు. నిబంధనల ప్రకారం పాత ఉత్తర్వులు పెండింగ్‌లో నెల రోజులకు మించి ఉంటే అవి రద్దవుతాయి. గత నెల 22వ తేదీన మేఘ స్వరూప్ బదిలీ అవగా, ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పివివిఎస్.మూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈయన గత కమిషనర్ ఆదేశించిన గుమాస్తాల బదిలీ ఉత్తర్వులను పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుతం ఈ ఉత్తర్వులకు నెల రోజుల సమయం ముగిసింది. ఈ నేపథ్యంలో నిబంధనల మేరకు వీటికి సంబంధించి కొత్త ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. పెండింగ్ ఉత్తర్వుల కాలపరిమితి ముగిసేలోగా వీటిని అమలు చేసేందుకు వీలుగా బుధవారం నాడు కొందరు గుమాస్తాలకు బదిలీ చేసిన స్థానాల్లో చేరాలంటూ అదనపు కమిషనర్ హరిబాబు ఫోన్లు చేసి చెప్పినట్టు సమాచారం. గుమాస్తాల బదిలీల్లో మూడేళ్ల కాల పరిమితి ముగియకనే ఒక సీటులో ఆరు నెలలు కూడా పనిచేయని వారిని బదిలీ చేశారు. దీనిపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అయ్యాయి. అకౌంట్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్ రజాక్ మూడేళ్లకుపైగా ఒకే సీట్లో పనిచేసినా ఆయనకు బదిలీ రాలేదు. ప్రజారోగ్య విభాగంలో ఎఫ్2 గుమస్తాగా పనిచేస్తున్న ఝాన్సీ మూడేళ్లకుపైగా ఒకే సీట్లో పనిచేస్తున్నా బదిలీ రాలేదు. నిబంధనలను గాలికొదిలేసి పట్టుమని ఆరు నెలలు, సంవత్సరం కూడా ఒకే సీట్లో పనిచేయని వారికి మాత్రం కాసులమాటున ఓ అధికారి బదిలీలు చేశారన్న విమర్శలు కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో నడుస్తున్నాయి. ప్రాధాన్యతాపరమైన సీట్లలో సక్రమంగా విధులు నిర్వహించక నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులకు అందలం ఎక్కించడం వెనుకు పెద్ద ఎత్తునే కాసుల మార్పిడి జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాల్టీలో కమిషనర్‌గా పనిచేసిన వారికి కార్పొరేషన్లలో అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, కార్యదర్శి తదితర అధికారుల సమ్మతిని తెలిపే పత్రాలను పంపాలని ఒకవైపు ప్రభుత్వం చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అనంత కార్పొరేషన్‌లో అడ్డుగోలుగా జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేసేలా చూడటం చూస్తుంటే అవినీతికి పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది.

ఎఫ్ఎసి కమిషనర్‌గా మూర్తి ఉత్తర్వులు అందుకున్న తర్వాత గుమాస్తా బదిలీల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్ది పారదర్శకంగా నిర్వహిస్తారని ఉద్యోగులు భావించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తే ఆచరణలో ఆదిసాధ్యం అవుతుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బదిలీల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్ది తమకు న్యాయం చేస్తాడు అనుకున్న అధికారి అక్రమాలకు పాల్పడిన వారి చర్యలను చూసీచూడనట్లు వదిలేస్తుండడం ఉద్యోగులను విస్మయానికి గురి చేస్తోంది. బదిలీలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాత ఉత్తర్వులనే యథాతథంగా అమలు చేయడం ద్వారా ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసినట్లవుతోందని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. గుమాస్తాల బదిలీలపై అంశంపై ఇన్‌ఛార్జి కమిషనర్ మూర్తిని ఫోన్లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుమాస్తాల బదిలీల్లో అక్రమాలను నియంత్రించి, అర్హులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

చెరువులు, కుంటలకు నీరు చేరేలా చర్యలు తీసుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల 116 చెరువులు, వందలాది కుంటలు పొంగిపొర్లుతున్నాయని, ఈ నీటిని పరిరక్షించుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం నాడు గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లో కరువు పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. ఇదే విషయాన్ని ఈ సంవత్సరం మే నెలలో అధికార నివేదికలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో గార్లదిన్నె, పుట్లూరు మండలాలలో ట్యాంకర్ల ద్వారా చీనీ, అరటి పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నించారని తెలిపారు. ఈ సంవత్సరం జూలై నెలలో వర్షాలు రాకపోవడంతో పంటల సాగు తగ్గిందన్నారు. కర్నాటకలో కురిసిన వర్షాల వల్ల తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయి సుమారు 40 టీఎంసీల నీరు సముద్రం పాలైందన్నారు. ఈ స్థితిలో జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల చెరువులు కుంటలకు చేరుతున్న నీటిని పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. చెరువులకు గండ్లు పడడం, తెగిపోవడం లాంటి వాటి వల్ల నీరు వృథా కాకుండా కాపాడాలని కోరారు. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించి, సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఆంజనేయులు కేసులో

వాస్తవాలను వెలుగులోకి తీసుకురండి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరానికి చెందిన లిటిల్ ఫ్లవర్ స్కూల్ అధినేత ఆంజనేయులుపై పోక్సో కేసు పెట్టడం పట్ల ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ లిటిల్ ఫ్లవర్ విద్యాలయ అధిపతిగా, సామాజిక తరగతుల నేతగా ఆంజనేయులు జిల్లా ప్రజలకు చిరపరిచితుడు అన్నారు. సామాజిక కార్యక్రమాలకు అండగా నిలిచే వ్యక్తి అన్నారు. అలాంటి వ్యక్తిపై పోక్సో కేసు నమోదు కావడం పట్ల వారి కుటుంబ సభ్యులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎస్పీ స్పందించి ఆంజనేయులు కేసుపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై న్యాయ, అన్యాయాలను తేల్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైసిపి శ్రేణులకు రక్షణ కల్పించండి

ఎస్పీని కోరిన జిల్లా వైసిపి నాయకులు

ఎస్పీని కలిసి బయటకు వస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి -అనంతపురం

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చాక జిల్లాలో వైసిపి శ్రేణులపై దాడులు అధికం అయ్యాయని వీటి నుంచి రక్షణ కల్పించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ జగదీష్‌ను ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, శంకరనారాయణ, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపి తలారి రంగయ్య తదితరులు కలిసి వినతిపత్రం అందించారు. తాడిపత్రిలో ఇటీవల జరిగిన ఘటనల గురించి ఎస్పీకి వివరించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో నెలకొన్న పరిస్థితిని తెలియజేశారు. అనంతరం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అప్రజాస్వామికంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ నేతలు దాడులకు పాల్పడి, ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని చెప్పారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే తన నివాసానికి వెళ్లేందుకు వీల్లేకుండా అధికార పార్టీ నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని చెప్పారు. దీనిపై పోలీసులు జోక్యం చేసుకుని తాడిపత్రిలో పెద్దారెడ్డి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే జిల్లాలోని వైసీపీ శ్రేణులంతా కలిసి పెద్దారెడ్డిని తాడిపత్రికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయంలో పోలీసుల నుంచి సానుకూల నిర్ణయం లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు ఉంటాయన్నారు. టిడిపి దాడులను ధైర్యంగా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రిలో జేసీ.ప్రభాకర్ రెడ్డి అరాచకాలు తీవ్రమయ్యాయన్నారు. తనను తాడిపత్రికి రానివ్వనని జేసీ బాహాటంగా ప్రకటించి, దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్య పద్ధతిలోనే తిప్పికొడతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్, జేసిఎస్ కన్వీనర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

బొమ్మనహాల్ : మండలంలోని చంద్రగిరి గ్రామం జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఎస్ఎంసి ఛైర్మన్ సులోమోన్, ఎంపిపి పాఠశాల అధ్యక్షుడు శేఖర్, హెచ్‌ఎంలు నిర్మల, ఓబుళపతి, టిడిపి నాయ కులు ధనుంజయరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి 500 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత, తాగునీరు, మొక్కల పెంపకం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు 'ఉపాధి' గ్రామసభలు

బొమ్మనహాల్ : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సర్పంచి, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించాలని ఎంపిడిఒ పర్వీన్‌బాను తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ కింద గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించాలన్నారు. ప్రతి సచివాలయానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి వారి ద్వారా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామ సభలను ప్రజలు, రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దాస్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను గుర్తించండి : ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం : నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గురువారం ప్రజా సమస్యల ప్రజావేదిక నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమిష్టి గా చర్చించి గ్రామ సమస్యలు గుర్తించి తమ దృష్టికి తెస్తే వాటి పరిష్కార మార్గాలపై సమీక్షిస్తామ న్నారు. ముందుగా గ్రామ సమస్యలపై ప్రజా సమస్యల ప్రజావేదికలో వినతి పత్రాలు అందజేయాలని కోరారు.

15 నుంచి అందుబాటులోకి ఇసుక

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానాన్ని వచ్చేనెల 15వ తేదీ నుంచి అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచిత ఇసుక విధాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇందుకోసం జిల్లాస్థాయిలో కోఆర్డినేషన్ కమిటీగా సమీక్షించుకుని ప్రజలకు సులభతరంగా ఇసుక అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఒక్క ఇసుక రీచ్ మాత్రమే రాయదుర్గంలో ఉందన్నారు. అక్టోబర్ 10వ తేదీ నుంచి 5 ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రాయదుర్గం రీచ్‌లో 58160 మెట్రిక్ టన్నుల ఇసుక ఉండగా నేడు 20,990 మెట్రిక్‌టన్నుల ఇసుక నిల్వ ఉందన్నారు. జిల్లాలో ఒక మెట్రిక్ టన్నుల ఇసుక రూ.195కే అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే అతి తక్కువ ధర ఉన్న జిల్లా మనదే అన్నారు. ఇసుక విషయంలో ఏదైనా సమస్యలు ఎదుర్కొన్నా, ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నెంబర్ 08554298380 ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. జిల్లాస్థాయిలో ఉచిత ఇసుక విధానం కమిటీకి తాను ఛైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా, లా అండ్ ఆర్డర్ సమస్యలపై ఎస్పీ, తహశీల్దార్ విఆర్ఓ, డిడి మైన్స్ జియాలజీ శాఖ అధికారి ఇసుక అమ్మలు విధానంలో పర్యవేక్షణ చేస్తుంటారని తెలిపారు. ఎవరైనా ఇసుకలో అవినీతి అక్రమాలకు పాల్పడినా, అధిక ధరలు వసూలు చేసినా, అక్రమ రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నగరపాకలో అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వద్దు

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థలో అభివృద్ధి పనులు అత్యంత వేగంగా చేపట్టాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌సిఎపి కార్యక్రమం కింద 2020-21 నుంచి 2023-24 వరకు రూ.11.4 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. అందులో ఇప్పటివరకు రూ.3.5 కోట్లు ఖర్చు అయ్యాయన్నారు. మిగిలిన రూ.7.79 కోట్లను నగరంలో పచ్చదనం పెంపు, రోడ్ల అభివద్ధి తదితర పనులకు ఖర్చు చేసేలా చూడాలన్నారు. నిధులున్నా పనులు చేపట్టకపోవడం సరికాదంటూ కార్పొరేషన్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి వేగవంతంగా వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీఎస్ఎన్.మూర్తి, డిటిసి వీర్రాజు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, పరిశ్రమల శాఖ ఎడి రాజశేఖర్ రెడ్డి, నగరపాలక సంస్థ ఈఈ సూర్యనారాయణ, డిఈఈ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

జిల్లా జడ్జి శివప్రసాద్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

విద్యతోనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా జడ్జి శివప్రసాద్ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నుసికొట్టాల తండాలో మండల స్థాయి అధికారులతో కలిసి న్యాయ సేవా సదస్సు నిర్వహిం చారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రధాన రహదారులకు దూరంగా ఉండే ప్రాంతాల్లో ప్రజలకు న్యాయ సేవలపై అవగాహన కల్పించేందుకు న్యాయస్థానం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సౌకర్యాలు, ప్రజల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై క్షుణ్ణంగా చర్చించారు. రహదారులు, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, డ్రెయినేజీలు, విద్యావంతులు, కోర్టు కేసులు, పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు, తదితర కుటుంబ సమస్యలపై ప్రజలతో చర్చించారు. న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచేందుకే ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మండల కేంద్రానికి దూరంగా ఉన్న గ్రామాల ప్రజలు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నట్లు గుర్తించామన్నారు. గ్రామంలో సమస్యలు ఉత్పన్నమైతే నేరుగా న్యాయ సేవాధికార సంస్థలో అర్జీ ఇవ్వవచ్చన్నారు. అందులో నిజాయితీ గల అంశాలను పరిగణలోకి తీసుకొని న్యాయపరమైన అంశాలు ఉంటే కచ్చితంగా బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, స్త్రీ శిశు సంక్షేమ, మండల పరిషత్, రెవెన్యూ శాఖల అధికారులతో చర్చించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. చిన్న చిన్న సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకుంటే ఎంతో శ్రేయస్కరమని జడ్జి వివరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, సిడిపిఒ లక్ష్మీప్రసన్న, తహశీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ సోలోమన్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ తిరుపాల్‌నాయక్, హౌసింగ్ ఎఇ లోకనాథ్‌చౌదరి, వైద్యాధికారి విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శివప్రసాద్

అసాంఘిక కార్యకలాపాలను అరికడదాం : డీఎస్పీ

విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్

ప్రజాశక్తి- కుందుర్పి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ రవికుమార్ తెలిపారు. డీఎస్పీ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట, నాటు సారా, కర్నాటక మద్యం క్రయ విక్రయాలు, చోరీలు, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్ప డితే కఠినంగా శిక్షిస్తామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా పోలీస్‌స్టేషన్‌ను రావచ్చ న్నారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని ప్రజలను కోరారు. పోలీసు సిబ్బంది కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడితే తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలని డీఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. డీఎస్పీతో పాటు ఎస్ఐ వెంకటస్వామి, హెడ్ కానిస్టేబుల్ అక్కులన్న, పోలీసులు ఉన్నారు.

జెఎన్‌టియుకు ఐఎస్ఒ గుర్తింపు

ఐఎస్ఒ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియుకు ఐఎస్ఒ సర్టిఫికెట్ లభించింది. ఏడు విభాగాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించినందుకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ గురువారం ఐఎస్ఒ సర్టిఫికెట్‌ను అందజేశారని ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి 7 నాణ్యత ప్రమాణాల్లో ఐఎస్ఒ సర్టిఫికెట్స్ రావడం గర్వకారణమన్నారు. ఈ నాణ్యత ప్రమాణాలను కాపాడుకోవాల్సిన అవసరం వర్సిటీలోని ప్రతి ఉద్యోగిపై ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రమాణాలను మెరుగు పరుచుకోవడానికి అందరు కృషి చెయ్యాలని తెలిపారు. అనంతరం ఆలపాటి శివయ్య హైమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ శివయ్య సర్టిఫికెట్‌ను అదించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓటిపి ఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ పి.చెన్నా రెడ్డి, ఎంబిఎ విభాగాధిపతి టి.నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయండి : ఏవో

బ్రహ్మసముద్రం : మండల కేంద్రమైన బ్రహ్మసముద్రంలో ఉన్న 14 సచివాలయాల పరిధిలో ఈ క్రాప్ నమోదు ను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారిణి సరిత తెలిపారు. ఆమె గురువారం మండ లంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఈ క్రాప్ నమోదును ప్రతి గ్రామంలో వేగవంతం చేయాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఉద్యాన అసిస్టెంట్లకు తెలిపారు. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 22 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారన్నారు. అందులో 3,755 ఎకరాల్లో మాత్రమే నమోదు చేశారన్నారు. ఈ క్రాప్ నమోదుపై రైతులు, అధికారులు త్వరితగతిన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు ముజవీర్‌బాషా, విఆర్ఒ మల్లికార్జున పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎంఆర్‌సి కార్యాలయం

నెర్రెలు చీలిన ఎంఆర్‌సి కార్యాలయం గోడలు

ప్రజాశక్తి-కుందుర్పి

స్థానిక మండల రీసోర్స్ సెంటర్(ఎంఆర్‌సి) కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దీంతో సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయం గోడలు పెద్దఎత్తున నెర్రెలు చీలాయి. చిన్నపాటి వర్షం కురిసినా పైకప్పు కారుతోంది. దీంతో రికార్డులు, కంప్యూ టర్లు తడవకుండా ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఎంఆర్‌సి కార్యాలయాన్ని మరో చోటకు మార్చాలి లేదా కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కార్యాలయ సిబ్బంది, ఎంఇఒ తిప్పేస్వామి కోరుతున్నారు.

నిరసన తెలుపుతున్న సత్యసాయి కార్మికులు

'సత్యసాయి' కార్మికుల విధులు బహిష్కరణ

నార్పల : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని బి.పప్పూరు వద్ద ఉన్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే తక్కువ వేతనం కూడా సమయానికి రాకపోవడంతో కుటుంబ పరిస్థితులు అగమ్యగోచరంగా మారాయని వాపోయారు. కనీసం పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నామన్నారు. ఆయా సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోకపోవడంతో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శ్రీరాములు, నాగభూషణ, చంద్రమోహన్, నరసింహులు, శంకర్, శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని విహెచ్ఎ

ఈక్రాప్ బుకింగ్ కాని పంటలు
పట్టించుకోని అధికారులు
ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని చింతకాయమంద-1 సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న విహెచ్ఎ ఉదయబాను రైతులకు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈమె చింతకాయమందతోపాటు కల్లూరు, వెంకటాంపల్లి గ్రామాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం సాగు చేసిన పంటలకు ఈక్రాప్ బుకింగ్ చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ఉద్యానవన సహాయకులు ప్రతియేడు ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేయాలి. ఈక్రాప్ బుకింగ్ చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పరిహారానికీ రైతులు అర్హులు కారు. దీంతో ఆందోళన చెందిన రైతులు గత సోమవారం పలువురు రైతులు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకుని ఎంపిడిఒ వీరరాజుకు రైతులు ఫిర్యాదు సైతం చేశారు. ప్రస్తుతం ప్రకృతిలో వస్తున్న మార్పుల కారణంగా అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోతున్నారు. ఈ సమయంలో ఈక్రాప్ బుకింగ్ చేయకపోతే తామంతా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విహెచ్ఎ రైతులకు అందుబాటులో వచ్చేలా చూడటంతోపాటు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈక్రాప్ నమోదు చేయాలని కోరుతున్నారు.

రైతుభరోసా కేంద్రం

మెమోలు జారీ చేసినా ఫలితం శూన్యం

రైతులకు అందుబాటులో ఉండకపోవడంతోపాటు ఆగస్టు మాసం పింఛన్ల పంపిణీలో ఆలస్యం చేసినందుకు కలెక్టర్ వినోద్‌కుమార్ విహెచ్ఎ ఉదయభానుకు మెమో జారీ చేశారు. అంతేగాకుండా విధుల్లో నిర్లక్ష్యం వహించడాన్ని ఆక్షేపిస్తూ మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, యల్లనూరు ఇన్‌ఛార్జి ఉద్యానవన అధికారిణి ఉమాదేవి కూడా పలుమార్లు మెమోలు జారీ చేశారు. అయినా అనారోగ్యం అంటూ వివరణ ఇచ్చినట్లు సమాచారం. అయితే మరికొన్ని దఫాలు వాట్సప్ ద్వారా వివరణ పంపినట్లు తెలిసింది.

నష్టపోతామనే భయం..
సూర్యనారాయణ, రైతు

ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఇప్పటి వరకూ ఈ క్రాప్ బుకింగ్ చేయలేదు. మండలంలోని అన్ని సచివాలయ పరిధిలో ఇప్పటికే ఆయా విహెచ్ఏలు క్రాప్ బుకింగ్ పూర్తి చేశారు. తమ గ్రామాల్లో మాత్రం ఇప్పటి వరకూ చేయలేదు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం అందకుండా నష్టపోతామనే భయం వెంటాడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విహెచ్ఎ విధుల్లోకి వచ్చి పంటలకు ఈ క్రాప్ బుకింగ్ చేసి రైతులు నష్టపోకుండా చూడాలి.

రైతులు నష్టపోకుండా చూస్తాం..
- రామకృష్ణ, వ్యవసాయ అధికారి

మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల్లో దాదాపుగా క్రాప్ బుకింగ్ పూర్తయింది. ఒక్క కల్లూరు, వెంకటాంపల్లి గ్రామాల్లో మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ కాలేదు. అక్కడ పని చేసే విహెచ్ఏ ఉదయబాను క్లస్టర్‌లో మాత్రం క్రాప్ బుకింగ్ కాలేదు. అయినా రైతులకు అన్యాయం జరగకుండా ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేస్తాం. రైతుల ఫిర్యాదు మేరకు విహెచ్ఎపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

ఎత్తిపోతల ద్వారా నీరు విడుదల

నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

యల్లనూరు : యల్లనూరు చెరువు నుంచి కోడుమూర్తి పంప్‌హౌస్‌లోని ఎత్తిపోతల పంపు ద్వారా గడ్డంవారిపల్లి చెరువుకు గురువారం నీరు విడుదల చేశారు. ముందుగా పంపులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పూజలు చేశారు. అనంతరం బటన్ నొక్కి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దొడ్లో రామాంజనేయులు, నాయకులు దొడ్లో హనుమంతు, కొత్తమిద్దె వెంకటరమణ, సూర్యనారాయణ, కుళ్లాయప్పనాయుడు, మోహన్‌నాయుడు, జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, బాబు దాదు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం కలెక్టరేట్ : అభివృద్ధి పనులను నిర్ణయించేందుకు శుక్రవారం జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులను గుర్తించడానికి సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులు హాజరై అభివృద్ధి పనులను గుర్తించాలని కోరారు.

ఎస్పీని కలిసిన అదనపు ఎస్పీ

అనంతపురం క్రైం : ఎస్పీ పి.జగదీష్‌ని అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి (అడ్మిన్) గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సాధారణ బదిలీల్లో భాగంగా డి.వి.రమణమూర్తి అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పంటలను నమోదు చేసుకోండి

నార్పల : మండల వ్యాప్తంగా ఖరీఫ్-2024లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 15,382 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు తెలిపారు. వీరందరూ తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

పుట్లూరు : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం ఇల్లు కూలి నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి టిడిపి నాయకులు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

వాహనాలు వేలం

అనంతపురం : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని ఐదు పాత వాహనాలను వచ్చేనెల 3న వేలం వేయనున్నట్లు సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.ఓబుళమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ప్రాజెక్ట్ డైరెక్టర్, డిఆర్‌డిఎ పేరుపై రూ.5వేలు డీడీ తీసి పాల్గొనాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పామిడి : ఇటీవల పట్టణంలో కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని 18వ వార్డు సంత మార్కెట్‌లో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో గురువారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు టిడిపి రాష్ట్ర రైతు కార్యదర్శి బొల్లు శ్రీనివాస్‌రెడ్డి తన సొంత నిధులతో క్రేన్ తెప్పించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మ మోహన్, అప్పన్నగారి కుమార్, మహమ్మద్ రఫీ, శ్యామ్‌రావు, నల్లబోతుల శ్రీనివాసులు, శంకర, తదితరులు పాల్గొన్నారు.

ఆట స్థలం చదును

బుక్కరాయసముద్రం : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సిద్ధలాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆట స్థలాన్ని చదును చేశారు. ఆట స్థలంలో వర్షం నీరు వచ్చి గుంతలు ఏర్పడటంతో రామలింగారెడ్డి సొంత నిధులతో ట్రాక్టర్ల ద్వారా మట్టి తోలి చదును చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ లింగమయ్య, ఎంపిపి స్కూల్ కమిటీ ఛైర్మన్ అంజి, కాటమయ్య, నాగేంద్ర, అది, రవి, మారుతీ, చెన్నమయ్య, రమేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు

పామిడి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న మండలంలోని ఎద్దులపల్లి-పాళ్యం గ్రామానికి వెళ్లే దారిలో టిడిపి నాయకులు గురువారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు టిడిపి నేత ఆర్ఆర్.రమేష్ సొంత నిధులతో జెసిబితో మట్టి వేయించి మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపిపి గోవిందరాజులు, మాజీ డీలర్ వెంకటేష్, యూత్ ప్రెసిడెంట్ కదిరిప్ప, సూర్యనారాయణ, యానిమేటర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

వజ్రకరూరు : ఉరవకొండ మండల పరిధిలోని కోనాపురం, పెన్నోబిలం, షేక్షాన్‌పల్లి, విడపనకల్ మండల పరిధిలోని చీకులగురికి గ్రామాల్లో రైతులు సాగుచేసిన వేరుశనగ, కంది పొలాలను మండల వ్యవసాయ అధికారులు శుభకర్, పెన్నయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ అధిక వర్షపాతం నమోదైనందున పైరుకు 19.19.19 లేదా పొటాషియం నైట్రేట్‌ను 5 గ్రాములు ఒక లీటర్ నీటికి పిచికారీ చేసుకోవాలన్నారు. వేరుశెనగ పైరు 50 రోజుల పైరుదశలో ఎకరాకు 200 కిలోల జిప్సంను చల్లుకుంటే కాయ నాణ్యంగా ఉంటుందని సూచించారు. పంటలకు పిచికారీ చేసే రైతులు జాగ్రత్తలు తీసుకోకపోతే శ్వాస, చర్మ సంబంధ వ్యాధులు వస్తాయన్నారు. ఇకపోతే రైతులు తప్పనిసరిగా రైతు సేవాకేంద్రాల్లో పంటలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్షాన్‌పల్లి, లత్తవరం ఆర్ఎస్‌కె సిబ్బంది చిక్కన్న, గోపాల్, రైతులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా ఎస్.వసుంధర

వైస్ ప్రిన్సిపల్ వసంధరను అభినందిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఎస్.వసుంధర గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

నేడు 'ఉపాధి'పై గ్రామసభలు

సమావేశంలో మాట్లాడుతున్న పామిడి ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్

పామిడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్రామసభలను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో విజయవంతం చేయాలని ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరగనున్న గ్రామసభలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలకు నియమించిన మండల స్థాయి పర్యవేక్షణ అధికారులు తప్పనిసరిగా పాల్గొని ప్రతి గ్రామంలో ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, మండల ప్రత్యేక అధికారి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ఉపాధి హామీ పనులపై శుక్రవారం మండల వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి గురువారం ఒక ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద వేతనాలు హక్కు, అర్హతలపై అవగాహన, ఇప్పటికీ మంజూరైన, పురోగతిలో ఉన్న పనులు చదవడం, ఆర్థిక సంవత్సరం 2024-25 కోసం ప్రతిపాదనలు, సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతపై అవగాహన, లైన్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన పనులపై గ్రామసభలో చర్చించనున్నట్లు తెలిపారు.

అనంతపురం రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేటి నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ పరిధిలోని 25 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యల్లనూరు : మండలంలోని 21 పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వీరరాజు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామసభలో అధికారులందరూ పాల్గొని ఉపాధి పనులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ షబ్బీర్, ఇసి ఓబులు, టిఎలు శంకర్, ప్రతాప్, శ్రీనివాసులు, సిఒలు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-అనంతపురం

కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యను నిరసిస్తూ గురువారం నగరంలోని రుద్రంపేట బైపాస్‌లో ఉన్న బాలాజీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీధర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సప్తగిరి సర్కిల్ కూడలి నుంచి ప్రారంభమైన టవర్‌క్లాక్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీధర్ మాట్లాడుతూ మహిళలపై హత్యాచారాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారిత విభాగాధిపతి కె.రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం గుత్తిలో పాత్రికేయులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ సిఎస్ఐ చర్చి మీదుగా ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ కూడలి వరకూ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు గుమ్మనూరు నారాయణ, బోర్‌వెల్ నాగరాజు, ఎన్.సుధాకర్ నాయుడు, సిపిఎం నాయకులు వి.నిర్మల, బి.రామకృష్ణ, ఎన్.రేణుక, యు.మల్లికార్జున, కవిత, ఎస్ఎఫ్ఐ నాయకులు సి.రమేష్, ధన, బాలు, ఖాజా, కృష్ణ, వైసిపి నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, డి.హుస్సేన్‌పీరా, ఎం.రంగస్వామి, డాక్టర్ ఎం.శాంతిప్రియ, జూనియర్ డాక్టర్లు, న్యాయవాదులు, మాజీ ఎంపీటీసీ డి.లక్ష్మీదేవి, ఎంఆర్‌పిఎస్ నాయకురాలు కె.సునీత, మెప్మా ఆర్పీలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, టిఐ ప్రాజెక్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో నిరసన తెలుపుతున్న నాయకులు

కొనసాగిన నిరసన ర్యాలీలు

అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలో బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించి నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో బాల్య వివాహాల నివారణ, కార్యాచరణ ప్రణాళికపై జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడంలో వచ్చే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో దృష్టి పెట్టాలన్నారు. ఇందుకోసం అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ద్వారా బాల్య వివాహాలు జరగకుండా ఆపిన అనంతరం పిల్లలకు చెందిన వారి కుటుంబాలలోని వారికి నైపుణ్యం కలిగించే శిక్షణ అందించి జాబ్ మేళాలో ఉద్యోగం ఇప్పించేలా చూడాలన్నారు. జిల్లాలోని పాఠశాలలకు టీచర్స్ అంతా వెళ్లేలా చూడాలని, పాఠశాలల్లోని తల్లిదండ్రుల కమిటీ సమావేశాల్లో పిల్లల అట్రాక్షన్, ఇతర విషయాలపై చర్చించాలన్నారు. అలాగే విద్యార్థినీ విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో ప్రతినెలా మెడికల్ చెకప్ చేయాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతుంటే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా యంత్రాంగం నుంచి హ్యాండిల్ చేస్తున్న సోషల్ మీడియాను జిల్లా అధికారులు, కింది స్థాయి సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, కార్యకర్తలందరూ ఫాలో అయ్యేలా చూడాలన్నారు. అనంతరం జిల్లా మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ రూపొందించిన 'బాల్య వివాహ రహిత భారతదేశం' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి, డిఎంఎహెచ్ఓ ఈబి.దేవి, డిఆర్‌డిఎ పీడీ ఓబుళమ్మ, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డిఇఓ వరలక్ష్మి, డివిఇఓ వెంకటరమణ నాయక్, ఐఅండ్‌పీఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామిశెట్టి, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషనాయుడు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం

రోగాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. గురువారం నగర పరిధిలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలో ఉన్న నందమూరి నగర్‌లో పర్యటించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదారు రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల దోమలు అధికంగా వృద్ధి అయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దోమలు వృద్ధి చెందితే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, పాత టైర్లు, డబ్బాలు, కొబ్బరి బొండాలు, తాగి పడవేసిన గ్లాసులు, వస్తువులు, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్ నూర్‌బాషా, కురుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి రవీంద్రారెడ్డి, సూపర్‌వైజర్ లక్ష్మన్న, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా సప్లిమెంటరీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌కెయు రిజిస్ట్రార్‌కు ఎస్ఎఫ్ఐ నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్‌కెయు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

మోగా సప్లమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఎస్‌కెయులో రిజిస్ట్రార్ రమేష్‌బాబును భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎసఎఫ్ఐ) నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలో ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాల పోరాట ఫలితంగా మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. అయితే విద్యార్థుల సబ్జెక్టులు వివరాలు తెలుసుకునేందుకు హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం సెమిస్టర్ వారీగా విద్యార్థులు ఫీజులు కట్టించుకోవడానికి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. విద్యార్థులకు సబ్జెక్టులు తెలుసుకునేందుకు ఎస్కే యూనివర్సిటీలోని ఎగ్జామినేషన్ సెక్షన్ వద్ద కౌంటర్లు ఏర్పాటు చేశారన్నారు. అయితే అక్కడికి వెళ్లిన విద్యార్థులను ఉద్యోగులు దుర్భాషలాడుతున్నారని వాపోయారు. ఎక్కువ సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులను 'నీకెందుకురా ఇంక చదువు.. పోయి పని చేసుకుని చావండి.. అందరూ ఇక్కడే కౌంటర్ దగ్గరికి వస్తున్నారా.. పక్కన కౌంటర్ వెళ్లి చావండి' అంటూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే విద్యార్థులు దుర్భాషలాడుతున్న ఉద్యోగి బాలాజీనాయక్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు, ఉపాధ్యక్షులు తరిమెల గిరి, జిల్లా కమిటీ సభ్యులు మారుతి, విద్యార్థులు సురేష్, శివ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సుపై శిక్షణ

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

నార్పల : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి ఆదేశాల మేరకు సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థ ద్వారా నిరుద్యోగ మహిళలు, యువతులకు బ్యుటీషియన్ కోర్సు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ యువతులు చైతన్యవంతులై అన్నిరంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే బ్యుటీషియన్ కోర్సుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దాదాపు 105 రోజులు శిక్షణ ఇచ్చి చివరి రోజు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ రసీద్ మహమ్మద్, ప్రభావతి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ లావణ్య, అంగన్వాడీలు, హెల్పర్లు, మహిళలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి
O.S.NO:33/2023
Between:
దొడ్డావుల సుధర్శన్ రెడ్డి S/o డి.శివారెడ్డి, డోర్ నెంబర్.131-A, G.C.R కాలేజీ రోడ్డు, గాండ్లపెంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది
మరియు
తెలికి నాగేంద్ర ప్రసాద్ బాబు S/o టి.నాగభూషణం, డోర్ నెంబర్.28-2-267, నవోదయ కాలనీ, 2nd Cross అనంతపురం జిల్లా. ...ప్రతివాది
ప్రతివాదికి నోటీసు
పై దావాలో మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 26/09/2024న వాయిదా వేసియున్నారు. ఆ రోజు మీరు స్వయముగా గానీ, మీ వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారికి తెలుపుకో గలరు. అట్లు హాజరు కాని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:26/09/2024
స్థలం:కదిరి
తూముకుంట బాబ్‌జాన్, ఎమ్.ఎ.,ఎల్.ఎల్.బి.,
యాకాశి వీరాంజినేయులు, ఎమ్.ఎల్.,
అడ్వకేట్స్, కదిరి.

5న స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను వచ్చేనెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు అదనపు కమిషనర్ హరిబాబు తెలిపారు. ఈమేరకు గురువారం ఎన్నికల నోటీసును జారీ చేశారు. బుధవారం నుంచి 28వ తేదీ వరకూ నామినేషన్ పత్రాల స్వీకరణ, 28న సాయంకాలం నామినేషన్ పత్రాలు జారీ చేసిన వారి వివరాలు ప్రచురిస్తామన్నారు. 29న నామినేషన్ పత్రాలు పరిశీలన, 29. సాయంకాలం అర్హత సాధించిన నామినేషన్ల వివరాల వెల్లడి, సెప్టెంబర్ 1న పోటీ అభ్యర్థుల జాబితాను ప్రచురణ, 5న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఎన్నికలు, అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

విద్యార్థుల అదృశ్యం కథ సుఖాంతం

ప్రజాశక్తి-గార్లదిన్నె

వివరాలు వెల్లడిస్తున్న సింగనమల సీఐ కౌలుట్లయ్య

మండల కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో అదృశ్యమైన విద్యార్థులు గురువారం తెల్లవారుజామున జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద కనిపించడంతో పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ గౌస్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆటల కోసం విద్యార్థులను వదిలారు. అయితే తిరిగి 6 గంటలకు బెల్ కొట్టిన తర్వాత 8వ తరగతి చదువుతున్న కనేకల్ మండలం ఊడేగల్ గ్రామానికి చెందిన నౌషద్, కొత్తచెరువు మండలం కేసాపురం గ్రామానికి చెందిన షేక్ అల్తాఫ్, ఆత్మకూరు మండలానికి చెందిన షేక్ ఇర్ఫాన్ పాఠశాలకు రాకుండా జిల్లాకేంద్రానికి వెళ్లారు. రాత్రి 9 గంటల సమయంలో విద్యార్థులు అటెండెన్స్ తీసుకున్నప్పుడు వీరు లేకపోవడంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయ నాయక్ విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. సిఐ ఆదేశాల మేరకు పోలీసులు విద్యార్థులు మిస్సింగ్ కేస్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. బుధవారం రాత్రి అన్ని స్టేషన్లకు సమాచారం ఇచ్చి విద్యార్థుల తల్లిదండ్రులతో పోలీసులు కలిసి జిల్లా కేంద్రంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్ మరియు రద్దీగా ఉండే ప్రాంతాలలో గాలించారు. ఈనేపథ్యంలో గురువారం ఉదయం 5 గంటల సమయంలో జిల్లా కేంద్రంలోని రజాక్ ఫంక్షన్ హాల్ దగ్గర విద్యార్థులు ఉన్నట్లు సమాచారం రావడంతో వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఎఫ్ఐఆర్ నమోదైనందు వల్ల విద్యార్థులను ఐసిడిఎస్ వారికి అప్పజెప్పి తర్వాత తల్లిదండ్రులకు చేరుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

మృతిచెందిన సునీత

గుత్తి : మండలంలోని తురకపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశ్వరరెడ్డి భార్య సునీత (35) కుటుంబ సమస్యలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బి.నబిరసూల్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.